
సాక్షి ఒడిశా

గురువారం । 19 । అక్టోబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,66,577
బంగారం	400 మిల్లీ గ్రాములు
వెండి	5 గ్రాముల 250 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ

భక్తిశ్రద్ధలతో పూజలు



దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గాదేవి మండపాలు, ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి.

-IIలో▸



హోరాహోరీగా పోటీలు

సెంచూరియన్ వర్సిటీ ఫుట్‌బాల్ మైదానంలో బుధవారం జిల్లాస్థాయి బాలికల ఫుట్‌బాల్ టోర్నీ ఉత్సాహంగా ప్రారంభమైంది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు.

-IIలో▸

న్యూస్‌రీల్

బీజేడీ యువ జనతాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఖడంగ



దేవాశీష్ ఖడంగ

రాయగడ: అధికార బీజేడీ యువ జనతాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా దేవాశీష్ ఖడంగ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ఆర్గనైజేషనల్ కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్‌దాస్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఖడంగ ఇప్పటి వరకు యువజనతాదళ్ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈయన స్థానంలో యువజనతాదళ్ జిల్లా అధ్యక్షునిగా అవినాష్ బిసాయి నియమితులయ్యారు.

ఆస్పత్రి పనులు వేగవంతం చేయండి



అధికారులతో చర్చిస్తున్న వీరవిక్రమ యాదవ్

జయపురం: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏడు అంతస్తుల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్టేట్ వర్క్స్ విభాగ ప్రధాన కార్యదర్శి వీరవిక్రమ యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిని సందర్శించారు. గడువు ముగిసినా పనులు పూర్తికాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే తగినంత మంది కార్మికులను తీసుకొచ్చి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీర్ ఇన్ చీఫ్ (సివిల్) మనోరంజన్ మిశ్రా, ఆర్‌అడ్‌బీ చీఫ్ ఇంజినీర్ దుఃఖబంధు బెహరా, అదనపు కలెక్టర్ గౌరవ శివాజీ ఇసాల్‌వార్ తదితరులు పాల్గొన్నారు.

కలప స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దుంగలు

రాయగడ: జిల్లాలోని మునిగుడ అటవీరేంజ్ పరిధిలో రఘుబారి సంరక్షిత అడవుల్లో విలువైన కలప దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఫారెస్టర్ సురేష్ చంద్ర పాత్రో, గార్డు కస్తూరీ ప్రహరాజ్‌ల నేతృత్వంలో పెట్రోలింగ్ చేస్తుండగా 32 దుంగలు కనిపించాయి. వీటిని స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



బీడీఓ స్నేహప్రభకు వినతిపత్రం అందజేస్తున్న చక్రవతి దురువ

జయపురం: సమస్యలు పరిష్కరించాలంటూ కొట్‌పాడ్ సమితిలోని దురువ గ్రామాల ప్రజలు బుధవారం బీడీఓ స్నేహప్రభకు వినతిపత్రం అందించారు. కొత్రిగుడ నది వద్ద పడవ ఏర్పాటు చేయాలని, రైతుల భూములకు సాగునీరు అందించాలని, ఛత్రల్ల వద్ద కొలాబ్ నదిపై వంతెన నిర్మించాలని, పంట నష్టం జరిగిన ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని, ప్రతి గ్రామంలోతాగు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దురువ మహిళా మహా సంఘ అధ్యక్షురాలు చక్రవతి, ఉపాధ్యక్షురాలు రొయిమతి దురువ, రత్నవతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి



ప్రమాదంలో మృతి చెందిన మహిళ

మల్కన్‌గిరి: జిల్లాలోని ఎం.వి.16 గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. మల్కన్‌గిరి నుంచి కలిమెల వైపు వెళ్తున్న పికప్ వ్యాన్‌ను కలిమెల నుంచి మల్కన్‌గిరి వస్తున్న స్కూటీ బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో మహిళతో పాటు డ్రైవర్‌కు గాయాలు కావడంతో ఇద్దరినీ స్థానికులు మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహిళ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలు కలిమెల సమితి ఎం.పి.వి.38 గ్రామమని తెలిసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఐఐసీ రీగాన్ కీండో తెలిపారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీసీ

చందన దాతలకు వందనం

- జగన్నాథ రథాల నిర్మాణంలో కలప కొరత నివారణకు చర్యలు
- ప్రత్యామ్నాయ వనరులపై ఆర్డీసీ సమీక్ష
- చందనం చెక్కలు ఉంటే సమర్పించాలని విజ్ఞప్తి

భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్ర విశ్వ విఖ్యాతం. ఈ యాత్రకు ఏటా కొత్త రథాల తయారీ ఆనవాయితీ. ఈ క్రమంలో రథాల తయారీకి అవసరమయ్యే కలప వనరులు నిండుకుంటున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించడంలో భక్తులు చేయూతగా నిలవాలని రెవెన్యూ డివిజనల్ కమిషనర్ (సెంట్రల్) అభ్యర్థించారు. రథాలకు ఉపయోగపడే చెక్క, గంధపు చెక్కలను కలిగి ఉన్నవారు భగవంతుని సేవకు సమర్పించాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీసీ సెంట్రల్ డాక్టర్ సురేష్ చంద్ర దొళై అధ్యక్షతన పూరీ సర్క్యూట్ హౌస్‌లో రథ కలప వనరుల సమీక్ష నిర్వహించారు.

865 దుంగలు అవసరం..

రథాల తయారీలో మొత్తం 865 రకాల కలప దుంగలు అవసరమవుతాయి. అధికార యంత్రాంగం సమాచారం ప్రకారం ప్రస్తుతం 53 కలప దుంగలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రానున్న యాత్రకు మరో 812 దుంగలు అవసరం.

అధ్యయన ప్రణాళిక..

రథం కలప అవసరాలను తీర్చేందుకు శ్రీజగన్నాథ వన ప్రాజెక్టు పురోగతి పట్ల నిత్యం అధ్యయనం కొనసాగుతుందని ఆర్డీసీ తెలిపారు. జిల్లా అటవీ శాఖ అధికారులు (డీఎఫ్‌ఓ)లు తమ పరిధిలో అధ్యయనం చేసి రథ కలప, గంధపు చెక్కల డేటాబేస్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

రథాల నిర్మాణానికి స్వచ్ఛందంగా కలపను అందిస్తున్న వారి గురించి ప్రచారం చేయాలన్నారు. అప్పుడే ఎక్కువ మంది కలపను స్వచ్ఛందంగా సమర్పించేందుకు ముందుకు వస్తారని చెప్పారు.

చందనం చెక్కల సమీకరణ..

జగన్నాథుని సేవకు చందనం చెక్కల సమీకరణ అవసరం. ఈ నేపథ్యంలో చెక్కలను స్వచ్ఛందంగా సమర్పించేందుకు ముందుకు వచ్చే భక్తులకు అనుబంధ వ్యవస్థ, నియమ నిబంధనలు సరళీకరణతో ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు డీఎఫ్‌ఓలు చర్యలు తీసుకోవాలని, శ్రీమందిరం పాలక వర్గం రథ కలప దాతలకు ప్రత్యేకంగా సత్కరించనుందని శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ రంజన్ కుమార్ దాస్ తెలిపారు. రథ కలప వనరుల అభివృద్ధి ప్రక్రియలో అందరి సహకారం కావాలని కోరారు. సమావేశంలో జిల్లా మెజిస్ట్రేట్ సమర్థ వర్మ, పూరీ జిల్లా అటవీ శాఖ అధికారి పి.రామస్వామి, ఖుర్దా డీఎఫ్‌వో పూర్ణిమా పాండియన్, నయాగఢ్ డీఎఫ్‌వో క్షమా షడంగి, భువనేశ్వర్ సిటీ డీఎఫ్‌వో అజిత్ శతపతి, ఘుమసర్ డీఎఫ్‌వో సుదర్శన్ బెహరా, బౌధ్ డీఎఫ్‌వో దేవప్రియ కంపా, శ్రీమందిరం సేవల విభాగం అడ్మినిస్ట్రేటర్ జితేంద్ర కుమార్ సాహు, సబ్ కలెక్టర్ భవతరణ్ సాహు, డిప్యూటీ కలెక్టర్ ప్రియదర్శిని మల్లిక్, అదనపు జిల్లా కలెక్టర్ (పరిపాలన) ప్రదీప్ కుమార్ సాహు పాల్గొన్నారు.

జగన్నాథుని రత్నభాండార్ తెరవాలి



పూరీ గజపతి మహారాజాను కలిసిన బీజేపీ రాష్ట్ర శాఖ ప్రతినిధి బృందం

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర శాఖ ప్రతినిధి బృందం బుధవారం స్థానిక సాహిద్‌నగర్ ప్రాంతం పూరీ గజపతి దివ్యసింగ్ దేవ్‌తో భేటీ అయ్యింది. శ్రీమందిరంలో జగన్నాథుని రత్న భాండార్ తెరవాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి అధ్యక్షతన శాసన సభ విపక్ష నేత (ఎల్‌ఓపీ) జయ నారాయణ్ మిశ్రా, పలువురు పార్టీ ప్రముఖులతో కూడిన ప్రతినిధి బృందం రాజాకు విన్నవించింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అనవసర జాప్యానికి పాల్పడుతోందని వివరించింది. మందిరం లోపల ఉన్న ఖజానాలో భద్రపరిచిన రత్న వైఢూర్యాలు, మణులు మాణిక్యాలు, బంగారం, వెండి ఇతరేతర అమూల్య సంపదతో స్వామి సేవల్లో వినియోగించే పాత్రలను దీర్ఘకాలంగా పరిశీలించడం లేదు. వీటి వివరాల్ని బహిరంగపరచాలని దీర్ఘకాలంగా పలు వర్గాలు ఒత్తిడి చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తుంది. ఈ నేపథ్యంలో పూరీ రాజు జగన్నాథ ఆలయ పాలక మండలి అధ్యక్షుడిగా ఉన్నందున, రత్న భండార్‌ను తెరిపించాలని వినతిపత్రం అందజేశారు.

20న ప్రైవేటు బస్సుల బంద్

పర్లాకిమిడి: గజపతి బస్సు యజమానుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు బస్సుల బంద్ చేపడుతున్నట్లు సంఘం అధ్యక్షుడు ఇంజా వెంకటరమణ తెలిపారు. గజపతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20న గ్రామీణ ప్రాంతాలకు ఓఎస్‌ఆర్టీసీ 36 కొత్త బస్సులను వివిధ రూట్లలో ప్రవేశపెడుతోంది. దీంతో ప్రైవేటు బస్సుల ఆదాయం తగ్గిపోతుందని ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఏసీసీఎంఐ పథకం కింద ఇప్పటికే రాష్ట్రంలో వెయ్యి అధునాతన బస్సులను నవరంగ్‌పూర్, కోరాపుట్, రాయఘడ, కంధమాల్, మల్కనగిరిలో అక్టోబరు 12న ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

క్యాపిటల్ ఆస్పత్రిలో ల్యాబ్ పరికరాలు చోరీ

భువనేశ్వర్: స్థానిక క్యాపిటల్ హాస్పిటల్ లేబొరేటరీలో మంగళవారం రాత్రి విలువైన పరికరాలు చోరీ అయ్యాయి. వీటి విలువ రూ.60 లక్షలు పైబడి ఉంటుంది. చోరీలో సెక్యూరిటీ గార్డులు, పారిశుద్ధ్య కార్మికుల ప్రమేయం ఉన్నట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న లేబొరేటరీలో కొన్ని పాత, కొత్త పరికరాలు దొంగిలించారు. బయట వ్యక్తి సహాయంతో యూనిఫాం ధరించిన ఆసుపత్రి ఉద్యోగులు కొందరు దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. వీడియో ఫుటేజీలో వారు గోనె సంచులలో లేబొరేటరి పరికరాలు తీసుకెళ్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని క్యాపిటల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీదర్ సాహు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలను గుర్తించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

గోవుల అక్రమ రవాణా అడ్డగింత



వ్యాన్‌లో తరలిస్తున్న గోవులు

బరంపురం: నగరానికి సమీపంలోని నరేంద్రపూర్ జాతీయ రహదారిలో బొడొజల గ్రామం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న గోవులను భజరంగ్ దళ్ ప్రతినిధులు పట్టుకున్నారు. ఐఐసీ అధికారి తమన్ కుమార్ మిశ్రా మరియు భజరంగ్ దళ్ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కుకుడాఖండి బ్లాక్ బొడొజల గ్రామం నుంచి అక్రమంగా టాటా వ్యాన్‌లో సుమారు 30 గోవులను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న సమాచారం అందుకున్న బరంపురం భజరంగ్ దళ్ ప్రతినిధులు, దక్షణపూర్ 16వ జాతీయ రహదారిలో మాటువేశారు. ఈలోగా జాతీయ రహదారి గుండా ఎదురుగా వస్తున్న టాటా పికప్ వ్యాన్‌ను అడ్డుకొని సోదాలు చేయగా, వ్యాన్‌లో సుమారు 30 గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలుసుకొని పోలీసులకు సమాచారం చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని డ్రైవర్, క్లీనర్‌ను అరెస్టు చేయడంతో పాటు గోవులను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు.

11 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



పెద్ద బజార్ పోలీసులకు చిక్కిన పేకాటరాయుళ్లు



జరడా పోలీసులు అరెస్టు చేసిన పేకాటరాయుళ్లు

బరంపురం: గంజాం జిల్లాలో కొద్దిరోజులుగా నడుస్తున్న రెండు వేర్వేరు జూదం అడ్డాలపై పోలీసులు దాడులు చేసి, 11 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఎస్డీపీవో పాఠి తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధి శ్రీరామ్‌నగర్ 7వ లైన్‌లో ఉన్నటువంటి ఇక ఇంటిలో కొద్ది రోజులుగా రహస్యంగా జూదం అడ్డా నడుస్తోంది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.19,200 నగదు, 7 సెల్‌ఫోన్లు, 2 పేకకట్టలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా జరడా పోలీసుస్టేషన్ పరిధి సింహాలి గ్రామంలోని మామిడితోటలో రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై జరడా పోలీసులు దాడిచేసి, నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి రూ.14,330 నగదు, 3 సెల్‌ఫోన్లు, 1 పేకకట్ట స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ మద్యం ఫ్యాక్టరీపై దాడులు



అరెస్టైన నిందితులు, స్వాధీనం చేసుకున్న సామగ్రి చూపిస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న నకిలీ లేబుల్స్

- నలుగురు నిందితులు అరెస్టు

బరంపురం: నగరంలో విజృంభిస్తున్న నకిలీ మద్యం మాఫియా ఆటకట్టించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆశిష్ కుమార్ సింగ్ ఆదేశాలతో బుధవారం మధ్యాహ్నం గొళంతరా పోలీసుస్టేషన్ పరిధి టమ్మనా-సియాలియా గ్రామ రహదారిలో ఉన్నటువంటి నకిలీ మద్యం ఫ్యాక్టరీపై దాడులు చేపట్టారు. బరంపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామచంద్ర మిశ్రా తెలిపిన వివరాల మేరకు.. టమ్మనా-సియాలియా గ్రామాల మధ్య నకిలీ మద్యం తయారవుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఆ ఫ్యాక్టరీపై దాడులు నిర్వహించి నలుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు 40 లీటర్ల స్పిరిట్, 20 లీటర్ల నకిలీ మద్యం మిశ్రమ ద్రవం, 500 మద్యం బాటిళ్లు, 3 వేల కప్పులు మరియు 500 నకిలీ లేబుల్స్ సీజ్ చేశారు. అరెస్టైనవారిలో హరడాఖంటికి చెందిన మున్నా నాయక్, సీతారామ వీధికి చెందిన బుల్లు పాత్రో, జోగొబందు వీధికి చెందిన శనియా సాహు మరియు కోనిసి సంతకి చెందిన నిలు సాహులు ఉన్నట్లుగా అధికారులు తెలియజేశారు.

ఓపీటీసీఎల్ టెక్ టవర్ ప్రారంభం



ఓపీటీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్ టెక్ టవర్



టవర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాజధాని భువనేశ్వర్‌లో ఓపీటీసీఎల్ టెక్ టవర్‌ను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం ప్రారంభించారు. సాహిద్ నగర్‌లో రూ.55 కోట్లతో నిర్మించిన ఈ బహుళ అంతస్తుల భవనం ఒడిశా పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓపీటీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంగా పనిచేస్తుంది. పూర్తి భద్రత వ్యవస్థతో ఆధునిక సాంకేతికతో ఈ భవనం నిర్మిస్తున్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి ప్రతాప్ కేశరీ దేవ్, సైన్స్ అండ్ టెక్నాలజీ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, ఎస్ఎస్ఈపీడీ శాఖ మంత్రి అశోక్ చంద్ర పండా, స్థానిక ఎమ్మెల్యేలు అనంత నారాయణ్ జెనా, సుశాంత్ కుమార్ రౌత్, విద్యుత్ విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి నికుంజ బిహారీ ధాలా, ఓపీటీసీఎల్ చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా, ముఖ్యమంత్రి (5టీ) కార్యదర్శి వి.కె.పాండియన్, ఓపీటీసీఎల్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కాగా, 2000 సంవత్సరంలో 16 లక్షల మంది వినియోగదారులను కలిగిన ఓపీటీసీఎల్ సంస్థ సేవలు 97 లక్షల మంది వినియోగదారులకు విస్తరించింది. 80 గ్రిడ్‌లతో ప్రారంభమై నేడు 194 గ్రిడ్ సబ్‌స్టేషన్లను కలిగి ఉంది. విద్యుత్ సరఫరా సామర్థ్యం 6,125 ఎమ్‌వీఏ నుంచి 25,800 ఎమ్‌వీఏకి పుంజుకుంది.

ఐఐటీ భువనేశ్వర్‌లో ఐటీఈపీ కోర్సు ప్రారంభం

భువనేశ్వర్: స్థానిక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) అత్యుత్తమ ఉపాధ్యాయులను తీర్చిదిద్ది భారతీయ విద్యా వ్యవస్థ విలువలను ద్విగుణీకృతం చేయడంలో మరో ముందడుగు వేసింది. దీనిలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల బీఎస్సీ - బీఈడీ ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ)ను ప్రవేశపెట్టింది. వివిధ రాష్ట్రాలకు చెందిన 50 మంది విద్యార్థులతో మొదటి బ్యాచ్ తరగతులను ఇటీవలే ప్రారంభించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ) ద్వారా విద్యార్థులను ఎంపిక చేసింది. ఐటీఈపీ కోర్సు నిర్వహిస్తున్న ఐఐటీ ఖరగ్‌పూర్ సరసన రెండో సంస్థగా స్థానిక ఐఐటీ స్థానం దక్కించుకోవడం విశేషం. ఇందులో ఉత్తీర్ణులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ)తో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్సీ) డిగ్రీ ప్రదానం చేస్తుంది. ఐదేళ్ల వ్యవధిలో పొందాల్సిన ఈ డిగ్రీ నాలుగేళ్లకే లభిస్తుండటం విశేషం.

న్యాయవాది మృతికి సంతాపం



ఖీమ్జీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న న్యాయవాదులు

జయపురం: పబ్లిక్ నోటరీ, ప్రముఖ న్యాయవాది మానసుక్‌లాల్ ఖీమ్జీ(76) మృతి పట్ల జయపురం జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు సంతాపం తెలియజేశారు. ఖీమ్జీ జయపురం గుజరాతీ కాలనీలోని సోమవారం మృతిచెందారు. ఈ నేపథ్యంలో బుధవారం కొరాపుట్ జిల్లా బార్ అసోసియేషన్ జిల్లా కోర్టు ప్రాంగణంలో సంతాప సభ ఏర్పాటు చేసి ఖీమ్జీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు సహదేవ్ పట్నాయక్, న్యాయవాదులు మదన మోహననాయిక్, శౌనంద మిశ్రా, రబీ పాత్రో, సుధీర్ త్రిపాఠీ, సరోజ్ దాస్, సుదీర్ షాడంగి, గోకుల సూర్య, గంగాధర నాయిక్, లాలూ షాడంగి, సుధీర్ కుమార్ పాడీ, తేజేశ్వర పండా, ఆరతి మహంతి, పి.సన్యాసిరావు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



పరుగు పోటీలో పాల్గొన్న విద్యార్థులు



ఆదివాసీ నృత్యం చేస్తున్న విద్యార్థులు

రాయగడ: క్రీడా రంగంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. రాయగడ మహిళా కళాశాలలో 40వ క్రీడా వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. కళాశాల స్థాయిలో రాణిస్తే రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. పట్టుదలతో ఆడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చనా పట్నాయక్ , అధ్యాపకులు క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

డిసెంబర్ 10 నుంచి నవరంగ్‌పూర్ మండయ్



మాట్లాడుతున్న కలెక్టర్ కమలోచన్ మిశ్రా, ఎస్పీ ఎస్.సుశ్రీ

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా గిరిజన సాంస్కృతిక ఉత్సవం మండయ్-2023 డిసెంబర్ 10న ప్రారంభం కానుంది. ఈ మేరకు బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మిషన్ శక్తి సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా ప్రకటించారు. ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా అగ్నిపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మండయ్ మైదానంలో డిసెంబర్ 10 నుంచి 12 వరకు ఉత్సవం నిర్వహిస్తారు. అదే వేదికపై 13, 14 తేదీల్లో లోకోత్సవ్ జరుగుతుంది. మంత్రులు, అవిభక్త కొరాపుట్ జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఉన్నతాధికారులు హాజరవుతారు. దేశంలో వివిధ రాష్ట్రాల సంప్రదాయ కళాకారుల ప్రదర్శనలు జరుగుతాయి. విశాలమైన మైదానంలో వాణిజ్య ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. సమావేశంలో ఎస్పీ ఎస్.సుశ్రీ, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

క్లుప్తంగా

పంచాయతీ కార్యాలయానికి తాళం



కాట్రగడ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

జయపురం: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యానికి నిరసనగా బొయిపరిగుడ సమితి కాటరగుడ గ్రామ పంచాయతీ కార్యాలయానికి బుధవారం స్థానికులు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూత్ గ్రూప్ అధ్యక్షుడు గోపాల డొంగరియ మాట్లాడుతూ పంచాయితీలో అనేక గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదని, తగిన రహదారులు లేవని, అర్హులకు పింఛన్లు అందటం లేదని, కనీస క్రీడా మైదానం లేదని, ఆయా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులకు వినతిపత్రాలు అందించినా పట్టించుకోలేదని, అందుకే తాళం వేసినట్లు తెలిపారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



నువాగడ క్రీడాకారిణుకు ట్రోఫీ, సర్టిఫికెట్లను అందజేస్తున్న జిల్లా క్రీడాధికారి అలేయారెడ్డి

పర్లాకిమిడి: జిల్లా స్థాయి బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్-23 స్థానిక సెంచూరియన్ వర్సిటీ ఫుట్‌బాల్ మైదానంలో బుధవారం ప్రారంభమైంది. జిల్లా అదనపు మెజిస్ట్రేటు రాజేంద్ర మింజ్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కాశీనగర్, నువాగడ, ఆర్.ఉదయగిరి, మోహానా, గుసాని, గుమ్మా సమితిల నుంచి క్రీడాకారిణులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, వర్సిటీ మేనేజర్ దుర్గాప్రసాద్ పాఢి, ఐటీడీఏ అధికారి ఫాల్గుణి మఝి, అదనపు కలెక్టర్ బీరెంద్రకుమార్ దాస్, జిల్లా క్రీడాశాఖాధికారి బి.అలేయా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: ఏపీ వైద్యవిధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పలు ఉద్యోగాలను కాంట్రాక్ట్/ ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ విధానంలో ల్యాబ్ టెక్నీషియన్-4 పోస్టులు, ఆడియో మెట్రీషియన్స్-1, ఎలక్ట్రీషియన్-1, ఔట్ సోర్సింగ్‌లో ల్యాబ్ అటెండెంట్- 4 పోస్టులను భర్తీ చేయనున్నారని, ఆసక్తి గల వారు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజర్వేషన్, అర్హతల వివరాలకు శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పేర్కొన్నారు.

సహిత విద్య ఆర్పీల ఇంటర్వ్యూలు రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: సహిత విద్య (భవిత) కేంద్రాల్లో రిసోర్స్‌పర్సన్(ఆర్పీ)ల ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూ ప్రక్రియ ఈ నెల 20న జరగనుందని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. సహిత విద్య కేంద్రాల్లో వీఐ/హెచ్ఐ, ఎంఆర్ ఆర్పీ పోస్టులకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 172 మంది దరఖాస్తులు చేసుకోగా సర్టిఫికెట్ల పరిశీలనకు 143 మంది హాజరయ్యారని, వారిలో ఆరుగురిని అనర్హులుగా గుర్తించామన్నారు. 11 మంది అభ్యంతరాల అనంతరం ఫైనల్ మెరిట్ లిస్టును డీఈవో శ్రీకాకుళం వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ జాబితాలో ఉన్న అభ్యర్థులకు ఎంఆర్‌కు, వీఐ/హెచ్ఐ కేటగిరిలకు వేర్వేరుగా 1:3 రేషియో ప్రకారం ఇంటర్వ్యూలకు పిలుస్తున్నట్టు చెప్పారు. శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి ఇంటర్వ్యూలు మొదలవుతాయని తెలిపారు. వివరాలకు 94924 20186 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సత్యం మాస్టారు ఆశయసాధనకు కృషి

మందస: ప్రజల బాగు కోసం పోరుబాట పట్టిన కామ్రేడ్ కొల్లి సత్యనారాయణ(సత్యంమాస్టారు) ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. సత్యం మాస్టారు సంస్మరణ సభ మందసలో బుధవారం జరిగింది. వివిధ పార్టీలు, సంఘాల ప్రతినిధులు హాజరై నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బి.తులసీదాసు, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.మోహనరావు, మార్పు ట్రస్ట్ అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, స్పందన నాయకులు వడ్డి గోపాలకృష్ణ, తెలుకల గణేష్, సీపీఎం నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, టి.లక్ష్మీనారాయణ, పి.దేవేంద్ర, ఎన్.గణపతి, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



భువనేశ్వర్: జాజ్‌పూర్ వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాల్లో లలితా దేవి స్వరూపంలో పూజలందుకున్న మాత



భువనేశ్వర్: వాసంతి దుర్గామాత నారాయణి స్వరూపం



భువనేశ్వర్: నవదుర్గ అలంకరణలో ఝంజిరి మంగళామాత



భువనేశ్వర్: గొదొ చండీమాత నారాయణి శోభ



బరంపురం: పూజలందుకుంటున్న మౌరి కాకువా అమ్మవారు

భక్తిశ్రద్ధలతో పూజలు

రాష్ట్రవ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గాదేవి మండపాలు, ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. ఆలయాలు, శక్తి పీఠాలు, పూజా మండపాల్లో అమ్మవారు బహుళ రూపిణిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: పూజలందుకుంటున్న చిన్న కాళికా అమ్మవారు



భువనేశ్వర్: వనదుర్గ అలంకరణలో కటక్ చండీ మాత



బరంపురం: పూజలందుకుంటున్న మా మంగళ దేవి



రాయగడ: పూజలకు సిద్ధమవుతున్న దుర్గాదేవి



బరంపురం: ఛత్రపూర్‌లో ప్రత్యేక అలంకరణలో మా రవణమ్మ



బరంపురం: పూజలందుకుంటున్న తరతరిణి అమ్మవారు



రాయగడ: రూపుదిద్దుకుంటున్న పూజా మందిరం



బరంపురం: ఆలయంలో కిక్కిరిసిన భక్త జనసందోహం

స్టాంపుల రుసుం పెంపు ఉపసంహరించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్:

సంక్షేమ స్టాంపుల నిధి రుసుం రూ.20 పెంపుదలను రాష్ట్ర బార్ ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో న్యాయవాదులు ఏకమై ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శ్రీకాకుళం జిల్లా బార్ అసోషియేషన్‌లో జిల్లాలోని వివిధ కోర్టుల పరిధిలో ఉన్న బార్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ప్రస్తుతం న్యాయవాదులకు ఆపద సమయంలో చెల్లిస్తున్న రూ.4 లక్షలను కనీసం రూ.20 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తాన్ని పెంచకుండా ఒక్క సంక్షేమ నిధి స్టాంపు రుసుం పెంపు సరికాదన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు వివేకానంద, డి.నర్సింహమూర్తి, కె.విజయలక్ష్మి, టి.సత్యం నాయుడు, రవి, పొన్నాడ రాము, గంగుల భాస్కరరావు, హరిప్రియ, ఎ.లక్ష్మీనారాయణ, భవానీప్రసాద్, బి.ఫల్గుణరావు, వాన కృష్ణచంద్, కూన అన్నం నాయుడు, సనపల హరి పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తాచాటాలి

ఎచ్చెర్ల క్యాంపస్:

విద్యతో పాటు క్రీడల్లో సత్తాచాటి జాతీయ స్థాయిలో రాణించాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎస్ఎంపురం క్యాంపస్‌లో బుధవారం జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో భరత్‌సాయి, రజిత, నళిని, విజేయ్, తవిటి నాయుడు, మనోజ్‌తరుణ్, నర్సింగరావు ప్రతిభ కనబరిచారు. వీరు పశ్చిమబెంగాల్‌లో డిసెంబర్ 27, 28 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ ఉన్నారు.



యోగా క్రీడాకారులను అభినందిస్తున్న డైరెక్టర్ జగదీశ్వరరావు, అధికారులు

మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్/శ్రీకాకుళం : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) పోర్టికో పైనుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. నగరంలో రైతు బజారు సమీపంలో నివసిస్తున్న దేగాది జ్యోతి విజయ్‌కుమార్‌కు 2022 సెప్టెంబరులో పలాసకు చెందిన యువతితో వివాహమైంది. విజయ్‌కుమార్ తండ్రి వెంకటరమణ జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ మరణించారు. దీంతో 2010లో కారుణ్య నియామకం కింద విజయ్ కుమార్‌కు జిల్లా జైళ్ల శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. విజయ్‌కు పెళ్లికి ముందే మద్యం అలవాటు ఉంది. వివాహమైన రెండు నెలలు వరకు దంపతులు బాగానే ఉన్నా మద్యం వ్యసనం కారణంగా గొడవలు మొదలయ్యాయి. మద్యం మానమని భార్య, తల్లి సీతారత్నం నచ్చజెప్పినా విజయ్ వినలేదు. దీంతో విసిగిపోయిన భార్య జనవరిలో కన్నవారింటికి వెళ్లిపోయింది. దీంతో మరింత మనోవేదనతో విజయ్ మద్యం అతిగా తాగడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఈ నెల 12న సూపర్‌వాస్మోల్-33 తాగాడు. వెంటనే తల్లి రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించింది. మరుసటి రోజు డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చినా మరళా ఆరోగ్యం బాగాలేకపోవడంతో అదే ఆసుపత్రికి వెళ్లాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం రిమ్స్ ఆసుపత్రి పోర్టికో మీద నుంచి విజయ్ దూకేశాడు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. తల్లి సీతారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.



మృతిచెందిన విజయ్‌కుమార్

పొట్టదశలో సాగునీరు అందించండి

- జగనన్నకు చెబుదాంలో కలెక్టర్‌కు రైతుల వినతి

గార : వరి పొట్టదశలో ఉందని, సాగునీరందించి పంటను కాపాడేందుకు సహకరించాలని వంశధార కుడి కాలువ, భైరిదేశిగెడ్డ కాలువ ప్రాంత రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం గార మండల కేంద్రంలో 'జగనన్నకు చెబుదాం' పేరిట ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ హాజరై వినతులు స్వీకరించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు వరి పంట చివరి దశలో ఉందని, సాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షాలు 40 రోజులుగా కురవలేదని, సాగునీరు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ గొండు రఘురాం, పార్టీ మండలాధ్యక్షుడు పీస గోపి, మార్పు పృథ్వీరాజ్, పీస శ్రీహరిరావు, కొయ్యాన నాగభూషణం, యాళ్ల నారాయణమూర్తి తదితరులు రైతులతో కలిసి కలెక్టర్‌కు సమస్య వివరించారు. ఎత్తిపోతల పథకాలు, పై ప్రాంతంలో గట్లు తొలగించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని వంశధార ఎస్ఈ డోల తిరుమలరావును కలెక్టర్ ఆదేశించారు. కనీసం 10 రోజులు ఏకధాటిగా నీరు ఇవ్వగలిగితే సమస్యను అధిగమించవచ్చన్నారు. తీర ప్రాంతంలో విద్యుత్ వైర్లు పాడయ్యాయని, వాటిని మార్చాలని కోరారు. రీసర్వే తర్వాత 8 వరకు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిపై దృష్టి పెట్టాలని తహశీల్దార్ రామారావుకు సూచించారు. అనంతరం 70 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్పీ జి.రాధిక, జేసీ ఎం.నవీన్, డీఎస్పీ శృతి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, ఆర్డీవో బి.శాంతి, డ్వామా పీడీ జి.వి.చిట్టి రాజు, సీపీఓ లక్ష్మీప్రసన్న, హౌసింగ్ పీడీ ఎన్.గణపతి, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఎంపీడీఓ సంజీవ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, రైతులు

క్లుప్తంగా

రూ.2 లక్షలు పలికిన దుర్గాదేవి ప్రసాదం



వేలంపాటలో ప్రసాదం దక్కించుకున్న సునీల్‌పట్నాయక్

లక్కవరపుకోట: మండలంలోని కోనమసివాని పాలెం గ్రామంలో దుర్గాభవాని సేవాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వేలం వేసిన లడ్డూ ప్రసాదాన్ని పెందుర్తి మండలం పులగానివాని పాలెం గ్రామానికి చెందిన సునీల్‌పట్నాయక్ రూ.2లక్షలకు దక్కించుకున్నారు. దేవీ నవ రాత్రుల సందర్భంగా గ్రామంలో పలువురు భక్తులు భవానీ మాలధరించారు. వారంతా మంగళవారం పీఠంలో అమ్మవారిని అన్నపూర్ణ అవతారంలో అలంకరించి అంబలం పూజ నిర్వహించి నైవేద్యంగా 40 కేజీల లడ్డూ సమర్పించారు. అంబలం పూజ అనంతరం లడ్డూను వేలంవేయగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భవానీ భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కొట్లాటలో ముగ్గురికి తీవ్రగాయాలు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను విచారణ చేస్తున్న ఎస్సై కృష్ణమూర్తి

భోగాపురం: మండలంలోని కొండ్రాజుపాలెం గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత పండగ సందర్భంగా వచ్చిన విశాఖపట్నం జిల్లా జాలారిపేటకు చెందిన ఇరువర్గాల వారి మధ్య కొట్లాట జరగడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి ముక్కాం పంచాయతీ తోటపల్లి మద్యం దుకాణం వద్ద జరిగిన కొట్లాటలో విశాఖలోని జాలారిపేటకు చెందిన ఇరువర్గాల వారు గొడవ పడి కొట్లాటకు దిగగా వారిలో మరుపల్లి చినరాము తలపై తీవ్ర గాయాలు కాగా, కేశవ అమ్మోరు కడుపులో కత్తిగాట్లు, మైలపల్లి రాజు కడుపులో గాయాలవడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. కొట్లాటకు దిగిన వారిలో కొందరు మాత్రమే తమ అదుపులో ఉన్నారని, మిగిలిన వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు

- ఈపీడీసీఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణ రావు



సమీక్షిస్తున్న ఎస్ఈ ఎం.లక్ష్మణ రావు

బొబ్బిలి: రానున్న వేసవిలో నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణ రావు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం బొబ్బిలిలోని ఈఈ కార్యాలయంలో పార్వతీపురం మన్యం జిల్లా, బొబ్బిలి ఈఈలు వి.కిశోర్, ఎ.అనంత రావు, ఏడీఈలు, డీఈలు, ఏఈలతో ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి ప్రణాళికతోపాటు స్థానికంగా ఎటువంటి సమస్యలూ రాకుండా చర్యలు తీసుకోవాలని, లైన్ ఇన్‌స్పెక్షన్ తరచూ చేయాలని,విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలందించాలని సూచించారు. సమావేశంలో రెండు డివిజన్ల ఈపీడీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

8 మద్యం బాటిల్స్‌తో ఒకరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: అనధికార మద్యం అమ్మకాలు చేస్తున్న వారిపై బుధవారం దాడులు నిర్వహించి కార్పొరేషన్ పరిధిలోని వై జంక్షన్ వద్ద 8 మద్యం సీసాలతో ఒక నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ బి.మధుకుమార్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్సై జాన్‌ప్రసాద్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఇబ్రహీం, ఇంటెలిజెన్స్ హెచ్‌సీ బాషా, కానిస్టేబుల్స్ రాము, సాధాన్య తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయానికి నీటి సరఫరా

భోగాపురం: మండలంలో నిర్మించనున్న విమానాశ్రయానికి మంచినీటి సరఫరాకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు మండలంలోని నీటివనరులు, విమానాశ్రయ భూములను రాష్ట్ర ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఏవీఎస్ రాజన్ బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విమానాశ్రయానికి మంచినీటి సరఫరాకు రూ.28 కోట్లు ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలిపారు. మండలంలోని నందిగాంలో గల చంపావతి నది నుంచి రామచంద్రపేట, గూడెపువలస గ్రామాల మీదుగా విమానాశ్రయ టెర్మినల్ వరకు భూగర్భ పైప్‌లైన్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఇందులో భాగంగా పనులు చేపట్టేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వైకుంఠనాయుడు, జేఈ హేమంత్, సిబ్బంది పాల్గొన్నారు

నాకౌట్ సమరానికి సర్వం సిద్ధం

- రేపటి నుంచి అంతరాష్ట్ర అండర్-19 మహిళల వన్డే క్రికెట్



ఎంఎల్ఎన్ రాజు, కార్యదర్శి, జిల్లా క్రికెట్ అసోసియేషన్, విజయనగరం



సర్ విజ్జీ క్రికెట్ మైదానం

విజయనగరం రూరల్: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్ రాష్ట్ర అండర్-19 మహిళల వన్డే క్రికెట్ నాకౌట్ మ్యాచ్‌లు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగు వేదికలు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలోని సర్ విజ్జీ క్రికెట్ మైదానం, డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానం, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంతో పాటు దాకమర్రిలోని కందుకూరి క్రికెట్ మైదానంలో మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు బుధవారం తెలిపారు. ఇటీవల జిల్లాలోని మూడు వేదికల్లో లీగ్ మ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నాకౌట్ టోర్నీలో హర్యానా, ఉత్తరాఖండ్, ముంబై, కర్ణాటక, జార్ఖండ్, తమిళనాడు, బరోడా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ జట్లు తలపడనున్నాయని చెప్పారు. ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లతో పాటు క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్ జిల్లాలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24న సెమీఫైనల్స్, 26న ఫైనల్ మ్యాచ్ జరుగుతాయని వివరించారు.

మ్యాచ్‌ల షెడ్యూల్

20.10.2023
- హర్యానా-ఉత్తరాఖండ్ (ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్-1), సర్ విజ్జీ క్రికెట్ మైదానం
- ముంబై-కర్ణాటక (ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్-2), ఎన్‌సీఏ అకాడమీ మైదానం
- జార్ఖండ్-తమిళనాడు (ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్-3), ఎంవీజీఆర్ క్రికెట్ మైదానం
- బరోడా-పంజాబ్ (ప్రీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్-4), కందుకూరి క్రికెట్ మైదానం

22.10.2023
- ఆంధ్రప్రదేశ్-టీబీడీ (క్వార్టర్ ఫైనల్-4), సర్ విజ్జీ క్రికెట్ మైదానం
- మధ్యప్రదేశ్-టీబీడీ (క్వార్టర్ ఫైనల్ మ్యాచ్-3), ఎన్‌సీ అకాడమీ క్రికెట్ మైదానం
- మహారాష్ట్ర-టీబీడీ (క్వార్టర్ ఫైనల్ మ్యాచ్-1) ఎంవీజీఆర్ క్రికెట్ మైదానం
- ఉత్తర్‌ప్రదేశ్-టీబీడీ (క్వార్టర్ ఫైనల్ మ్యాచ్-(2) ఎంవీజీఆర్ క్రికెట్ మైదానం

ట్రెజరీలకు నూతన భవనాలు

- ఒక్కో భవనానికి రూ.75 లక్షలు మంజూరు
- స్థలాలు కేటాయించిన ప్రభుత్వం
- డీటీఏఓ కుమార్



స్థలపరిశీలన చేస్తున్న జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి

చీపురుపల్లి: జిల్లాలోని పలు ఉపఖజానాశాఖ కార్యాలయాలకు అధునాతన వతసతులతో సొంత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి(ఎఫ్ఏసీ) ఆర్ఏఎస్.కుమార్ చెప్పారు. ఈ మేరకు బుధవారం చీపురుపల్లి వచ్చిన ఆయన స్థానిక ఉపఖజానాశాఖ కార్యాలయంలో వార్షిక తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, విధులు సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో నూతన ట్రెజరీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో చీపురుపల్లి, భోగాపురం, ఎస్.కోట, విజయనగరం(అర్బన్)లో నూతన ట్రెజరీ కార్యాలయ భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.75 లక్షలు నిధులు మంజూరయ్యాయని, ప్రభుత్వం స్థలాల కేటాయింపు కూడా పూర్తి చేసిందని తెలిపారు. రాజాంలో నూతన భవనం పనులు పూర్తయ్యాయని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఓ నూక రాజు తదితరులు పాల్గొన్నారు.

సారా ప్యాకెట్లతో మహిళ అరెస్టు

నెల్లిమర్ల: మండలంలోని అప్పయ్యపేట గ్రామంలో స్పెషల్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (నెల్లిమర్ల), డీటీఎఫ్ (విజయనగరం) సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించి 30 సారా ప్యాకెట్లు కలిగి ఉన్న ఒక మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు సీఐ జీఎస్ రాజశేఖర్‌నాయుడు తెలిపారు. కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణలో ప్రతిభ చూపిన పోలీస్ డాగ్ హ్యాండ్లర్



డాగ్ హ్యాండ్లర్ జగదీష్‌కు రివార్డు అందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసుశాఖ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి పీటీసీలో నిర్వహించిన తొమ్మిది నెలల శిక్షణలో జిల్లాకు కేటాయించిన ట్రాకింగ్ డాగ్ 'లవ్లీ' స్పేర్ హ్యాండ్లర్ బి.జగదీష్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర హోం శాఖ మంత్రి చేతుల మీదుగా బహుమతి పొందినట్లు ఎస్పీ ఎం.దీపిక బుధవారం తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న అనంతరం జిల్లాకు చేరుకున్న ట్రాకింగ్ డాగ్ లవ్లీ, డాగ్ హ్యాండ్లర్ జగ దీష్ మర్యాదపూర్వకంగా ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా శిక్షణ తీరును, లవ్లీ ఆరోగ్యం, శిక్షణ నైపుణ్యం గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.గోపాల నాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి మృతదేహం లభ్యం



బాలుడి మృతదేహం, (ఇన్‌సెట్లో) కార్తీక్ (ఫైల్)

కొమరాడ: ఈ నెల 16 తేదీన అదృశ్యమైన మండలంలోని కొట్టు గ్రామానికి చెందిన కె.కార్తీక్(9) మృతదేహం బుధవారం లభ్యమైంది. కుమారుడు తప్పిపోవడంతో తల్లిదండ్రులు బంధువులు అన్నిచోట్లా వెతికి 17తేదీన కొమరాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఇంతలో నాగావళి నదీ ప్రవాహంలో కొట్టుకువచ్చిన బాలుడి మృతదేహం దళాయిపేట గ్రామ సమీపంలో స్థానికులకు కనిపించింది. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం మేరకు సంఘటన స్థలానికి కొమరాడ పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సంతకవిటి: మండల పరిధి పుల్లిట సమీపంలోని చెరువులో మతిస్థిమితం లేని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. దీనికి సంబంధించిన ఎస్సై బి.లోకేశ్వర రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మతిస్థిమితంలేని వ్యక్తి పుల్లిట, మామిడిపల్లి ప్రాంతాల్లో వారం రోజుల నుంచి భిక్షాటన చేసుకుంటూ వేరే భాషలో మాట్లాడుతూ తిరుగుతుండే వాడు. బుధవారం ఉదయం పుల్లిట సమీపంలో చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు బిచ్చగాడిగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై లోకేశ్వరరావు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉంటాడని, ఎవరైనా సంబంధిత వ్యక్తులు గుర్తిస్తే సంతకవిటి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: బలిజిపేట మండలంలోని అంపావల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ డి.దాలయ్య అప్పుల బాధతో బుధవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ మేరకు జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్న దాలయ్యకు తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం రూ.5లక్షలు అప్పుచేశాడు. అప్పు తీర్చలేక మనస్తాపానికి గురై మామిడితోటలో పురుగు మందు తాగేశాడు. ఈ విషయం తెలుసుకున్న స్నేహితులు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మూడు కేసుల్లో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: పట్టణ పరిధిలో జరిగిన మూడు దొంగతనాల కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు బుధవారం స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరావు మాట్లాడుతూ బైక్ కవర్‌లో రూ.2 లక్షల 50వేలు నగదు పెట్టి ఎదురుగా ఉన్న షాపులోకి వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. వెంటనే కేఎల్‌పురానికి చెందిన బాధితుడు శ్రీనివాసరావు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కేఎల్‌పురం జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేసి కేఎల్.పురానికి చెందిన కె.వెంకటరమణగా గుర్తించి రూ.2 లక్షల 35 వేలు రికవరీ చేసి, అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. అలాగే ఈ నెల 17న డయల్ 100కి వచ్చిన కాల్ ఆధారంగా పోలయ్యపేట జంక్షన్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి ఏటీఎంలో నగదు అపహరించే ప్రయత్నం చేశాడు. అప్రమత్తమైన పోలీసులు సంఘటన స్థలం వద్దనే కంటోన్మెంట్‌కు చెందిన బండి కేరీబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే మరో కేసులో ఫ్యాన్ రిపేర్ చేస్తానని ఇంటికి వచ్చి వృద్ధురాలి మెడలో రోల్డ్‌గోల్డ్ చైన్ లాక్కుని పరారైన సంఘటనలో కేసు నమోదుచేసిన పోలీసులు శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరుకు చెందిన నర్తు చిన్నారావును అరెస్ట్ చేసి, రోల్డ్‌గోల్డ్ చైన్ రికవరీ చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసులు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు. సమావేశంలో ఎస్సైలు వి.అశోక్ కుమార్, ఎ.నరేష్, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రవివర్మ (ఇన్‌సెట్లో) మృతుడు విశ్వనాథం (ఫైల్)

కొత్తవలస: మండలంలోని కొత్తవలస-విజయనగరం రైల్వేలైన్‌లో అడ్డూరు వాని పాలెం గ్రామం సమీపంలో హౌరా నుంచి వచ్చిన రైలు నుంచి మండలంలోని చీపురువలస గ్రామానికి చెందిన రావాడ విశ్వనాథం(23)జారి పడి మృతి చెందాడు. బుధవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి రైల్వే ఎస్సై రవివర్మ, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఐటీఐ చదువుకున్న విశ్వనాథం జగదల్‌పూర్ సమీపంలో జరిగిన ఆర్మీ ఎంపికలకు సంబంధించిన పరీక్షలు రాసేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా జారిపడి మృతి చెందాడు. విశ్వనాథం ఎంతో ఉల్లాసంగా ఉంటూ గ్రామంలో అందరికీ తలలో నాలుకలా వ్యవహరించే వాడని గ్రామస్తులు చెబుతున్నారు. మృతుడి తండ్రి చెల్లయ్య తాపీ పని చేసుకుంటూ చదివించాడు. దేశసేవ చేసి కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్న కుమారుడి అకాలమరణంతో కుటుంబసభ్యులు భోరుమంటూ రోదించారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై రవివర్మ తెలియజేశారు.

ఓఎఫ్‌సీ కేబుల్ వేసేందుకు అనుమతులు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో మొబైల్ టవర్ల ఓఎఫ్‌సీ కేబుల్ వేసేందుకు అటవీ అనుమతులు మంజూరుచేస్తూ జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పాచిపెంట మండలం తోటవలస నుంచి మాతుమూరు వరకు ఓఎఫ్‌సీ కేబుల్ వేసేందుకు 0.66 హెక్టార్ల స్థలం కేటాయించారు. అలాగే పాలకొండ, భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాలలో 55 మందికి ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలకు గాను 61.34 ఎకరాల స్థలానికి అటవీ అనుమతులు మంజూరు చేశారు. ఇందులో పాలకొండ మండలంలో 8 క్లెయిమ్‌లకు గాను 11.57 ఎకరాలు, సీతంపేట మండలంలో 25 క్లెయిమ్‌లకు గాను 27.17 ఎకరాలు, వీరఘట్టం మండలంలో 11 క్లెయిమ్‌లకు గాను 11.46 ఎకరాలకు ఆర్‌ఓఎఫ్ఆర్ అనుమతులు మంజూరయ్యాయి. ప్రభుత్వం ఇచ్చిన సిఫార్సులకు అనుగుణంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సామాజిక మార్పు, వైద్య అత్యవసర పరిస్థితులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిక ప్రాముఖ్యం దృష్ట్యా వాటిని మంజూరుచేసినట్లు కమిటీ తీర్మానించింది. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, జిల్లా అటవీశాఖాధికారి జీఏపీ.ప్రసూన, పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యబృందాన్ని సత్కరిస్తున్న దేవాదాయశాఖ ఈఓ తదితరులు



మహిషాసురమర్దిని నృత్యప్రదర్శన

రాజాం: పట్టణంలో పోలిపల్లిపైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద బుధవారం ఏర్పాటుచేసిన కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో పాటు జానపద, భక్తి గీతాల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవాదాయ-ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఈ ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. గరివిడికి చెందిన బాలభవన్ విద్యార్థులు, సుంకరి రమేష్ మాస్టార్ నేతృత్వంలో ఈ సందర్భంగా నృత్యప్రదర్శన ఇచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం నృత్య బృందాన్ని ఆలయ ఈఓ బీవీ మాధవరావు, అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ, ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, కమిటీ సభ్యులు సలాది తులసీ మాస్టార్, గ్రంధి గోపి, వెంపల లక్ష్మణరావు తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో రాజాం పట్టణానికి చెందిన భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతం కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు




క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో బీసీఏ, డిప్లమో చదివిన విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. హాజరైన వారికి స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన వారిని ఇంటర్వ్యూ చేసి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఇంటర్వ్యూలకు సుమారు 800 మంది హాజరు కాగా 220 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపిక ప్రక్రియ లీడ్ ఎంప్లాయ్ రిలేషన్స్ అధిపతి డి.లక్ష్మీదీపక్, మేనేజర్ ఎల్.డి లక్ష్మీదుర్గ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి పాల్గొన్నారు.

సీతంలో భవిష్య 2.0 ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బీబీఏ, ఎం.కాం, ఎంబీఏ విద్యార్థులకు రిలయన్స్ రిటైల్స్ స్టోర్స్ ప్రాజెక్ట్ లీడ్ ముబీనా షేక్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం భవిష్య 2.0 గురించి బుధవారం వివరించారు. విద్యార్థులు నూతన వ్యాపారాలు ప్రారంభించడానికి రిటైల్ రంగంలో పనిచేయడానికి శిక్షణ అందిస్తామని ఈ సందర్భంగా ప్రాజెక్ట్ లీడ్ ముబీనా షేక్ తెలిపారు. విద్యార్థులు చదువుకుంటూ ఇంటర్న్‌షిప్ ద్వారా డబ్బులు సంపాదించుకోవచ్చని, నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.వరూధిని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు ఆహ్వానం



దివంగత హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు కుటుంబ సభ్యులకు ఆహ్వానం పలుకుతున్న కమాండెంట్ రాహుల్‌దేవ్ శర్మ

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఈ నెల 21న జరగనున్న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి పోలీస్ అమరవీరుల కుటుంబాలను బెటాలియన్ కమాండెంట్ రాహుల్ దేవ్‌శర్మ ఆహ్వానిస్తున్నా రు. 5వ ఏపీఎస్పీ బెటాలియన్ తరపున విధు లు నిర్వహించి అసాంఘిక శక్తుల దాడుల్లో అమరులైన డెంకాడకు చెందిన హెచ్‌సీ కృష్ణారావు కుటుంబ సభ్యులను బుధవారం ఆహ్వానించారు. హెచ్‌సీ తల్లిదండ్రులకు పండ్లను అందజేశారు. కార్యక్రమంలో బెటాలియన్‌కు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు గొప్ప సంఘ సంస్కర్త

విజయనగరం: ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావం కోసం తన ప్రాణాలను త్యాగంచేసిన గొప్ప దార్శనికుడు, సంఘసంస్కర్త అమరజీవి పొట్టి శ్రీరాములు అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి, అమరజీవి జిల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన రెండు లక్షల స్టిక్కర్లను బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బి.పి.ఎస్.రామయ్య, ఎ.వి.కృష్ణారావు, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఈవీఎంల తనిఖీ



సమావేశం మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఈవీఎంలు, వీవీ ప్యాట్ల తొలిదశ తనిఖీలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నెల్లిమర్ల సమీపంలోని పాత డ్వామా కార్యాలయంలో ఈ నెల 16 నుంచి తనిఖీ ప్రక్రియ జరుగుతోందన్నారు. దీనికి అన్నిరాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలన్నారు. మొదటిదశ తనిఖీ ప్రక్రియలో ఈ నెల 17వ తేదీ వరకు 371 బ్యాలెట్ యూనిట్లు, 360 కంట్రోల్ యూనిట్లు, 361 వీవీ ప్యాట్లను తనిఖీ చేశామన్నారు. ఆఖరి రెండు రోజుల్లో 5 శాతం ఈవీఎంలతో మాక్ పోల్‌ను నిర్వహిస్తామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 1847 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అసెంబ్లీ ఎన్నికల కోసం 20 శాతం, పార్లమెంట్ ఎన్నికలకోసం మరో 20 శాతం ఈవీఎంలను రిజర్వులో ఉంచుతామని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా గతవారం రోజుల్లో మొత్తం 753 క్లెయిమ్స్ వచ్చాయని, వీటిలో ఫారమ్-6లు 416, ఫారమ్-7లు 194, ఫారమ్-8లు 143 వచ్చినట్టు కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, ఈఆర్‌ఓలు వెంకటేశ్వరరావు, పద్మలత, నూకరాజు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, పి.పైడిరాజు, దయానంద్, మురళీమోహన్, సోములు పాల్గొన్నారు.